

పీర్ల మాన్యం భూముల సర్వే

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని పీర్ల మాన్యం భూములను శనివారం జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ వసీం అక్రమ్ నేతృత్వంలో స్థానిక రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 2022లో 14.84 ఎకరాలు, సర్వే నెంబర్ 106లో 2.46 ఎకరాలు పీర్ల మాన్యం ఉందన్నారు. దురాక్రమణల బారి నుంచి పీర్ల మాన్యం భూములను కాపాడేందుకు సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఆ భూములను సమగ్రంగా సర్వే చేయించి స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా సరిహద్దులు ఏర్పాటు చేసి పరిరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో పీలేరు మండల సర్వేయర్లు హరి, అన్నపూర్ణ, విఆర్ఒ రవి, పీర్ల మాన్యం ముతవల్లి మోదిన్ బాష, వంశపారంపర్య ముజావర్లు పాల్గొన్నారు.



పీర్లమాన్యం భూములు సర్వే చేస్తున్న అధికారులు

పక్కాగా ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కగా చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలంలో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై జరుగుతున్న రీ వెరిఫికేషన్ ప్రక్రియకు సంబంధించి చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ శ్రీధర్ వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వీరబల్లి మండలంలో ఫ్రీ హోల్డ్‌కు సంబంధించి 296 రిజిస్ట్రేషన్లను విచారణ చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 161 రిజిస్ట్రేషన్ల సర్వే నంబర్లను క్షేత్ర స్థాయిలో విచారణ చేశామని తెలిపారు. మిగిలిన వాటిని వేగవంతంగా పరిశీలన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లలో పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందాయన్నారు. రాష్ట్రంలోని అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, చిత్తూరు, తిరుపతి, సత్యసాయి, ప్రకాశం ఆరు జిల్లాలలోని ఆరు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లను రీ వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అన్నమయ్య జిల్లాలో వీరబల్లి మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మేరకు పారదర్శకంగా రీ వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎవరి ఒత్తిడికి గురికారాదని సూచించారు. రికార్డ్స్ ఆఫ్ రీ వెరిఫికేషన్‌కు సంబంధించి ఒక నిర్దిష్టమైన ప్రొఫార్మా ఇవ్వడం జరిగిందని, సదరు ప్రొఫార్మాలోని అన్ని అంశాలకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను సమర్పించాలన్నారు. పైలట్ మండలంగా ఎంపికైన వీరబల్లి మండలంలో ఇంకనూ రీ వెరిఫికేషన్ చేయాల్సిన 135 రిజిస్ట్రేషన్‌లను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో వెంటనే విచారణ చేసి వారంలోగా నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘాస్వరూప్, నైదియా దేవి, ఆర్‌డిఒ రంగస్వామి, తహశీల్దార్లు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఉదయం 6 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ముఖ్య ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రజాదర్బార్ ద్వారా స్వీకరించిన అర్జీలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజులలో ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనలో మంత్రి

మండలంలోని పడమటికోన గ్రామం నడిగడ్డపల్లెలో సీతారామాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ముందుగా మంగళ వాయిద్యాల నడుమ మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. పెళ్లిరోజు సందర్భంగా మంత్రి దంపతులు చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : 'చమర్తి'



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శనివారం పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల దశ, దిశ మారనున్నాయని చెప్పారు. గ్రామసభల ద్వారా సమస్యలను గుర్తించి గ్రామాలలో సదుపాయాలు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మూడు నెలల్లోనే రూ.1500 కోట్లు నిధులు కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. 2014 నుండి 2019 వరకు గ్రామాలలో చంద్రబాబు నాయుడు వేసిన సిసి రోడ్లు, విద్యుత్ దీపాలు తప్ప వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన ఒక పని కూడా గ్రామాలలో కనిపించలేదన్నారు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి సమస్యలను గుర్తించి, ప్రతి గ్రామంలోని ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించి గ్రామాల అభివృద్ధితో దేశంలోనే రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే దోచుకోవడం కాదని, పంచాయతీలను నిర్వీర్యం చేసి సర్పంచ్‌లకు తెలియకుండా నిధులను దోచుకోవడం కాదని పేర్కొన్నారు. సర్పంచ్‌లను గౌరవిస్తూ గ్రామాలలో అభివృద్ధికి నిధులు కేటాయించినప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమన్నారు. అది ఒక చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్‌బాష, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పార్లమెంట్ కార్యనిర్వాక కార్యదర్శి కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎస్కే కరీమ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి మండెం అబూబకర్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న ప్రిన్సిపల్ యువరాజ్

హెచ్ఎల్ఎస్ఐతో 'మిట్స్' ఒప్పందం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మరియు హ్యాబిలేట్ లెర్నింగ్ సొల్యూషన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ (హెచ్ఎల్ఎస్ఐ)తో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నట్లు కళశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఒప్పందం కార్యక్రమంలో యువరాజ్, ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం విద్యార్థులు, అధ్యాపకులు స్కిల్ బేస్డ్ ట్రైనింగ్‌ను కంపెనీ ద్వార అందజేయడం ముఖ్య ఉదేశ్యమని ప్రిన్సిపల్ యువరాజ్ పేర్కొన్నారు. పారిశ్రామిక శిక్షణా కార్యక్రమాలను మరియు అతిథి లెక్చరర్‌లను అందించడానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లతో పాటు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఇందుకు కావలసిన శిక్షణను ఆ కంపెనీ వారు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్ పాల్గొన్నారు.

మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీగా నిర్ధారణ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాను మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీగా నిర్ధారణ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు శ్రీధర్ చామకూరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీం కోర్టు, ప్రభుత్వం ఆదేశాను సారం జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-సానిటరి లెట్రిన్స్ వివరాలపై సంబంధిత శాఖల ద్వారా జిల్లాలో సర్వే నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఇన్-సానిటరి లెట్రిన్స్, మాన్యువల్ స్కావెంజర్స్ లేరని సంబంధిత శాఖలు నివేదికలు సమర్పించారని పేర్కొన్నారు. జిల్లాను మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీగా నిర్ధారిస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీనిపై ఏమైన అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 6వ తేదీలోపు సంబంధిత మున్సిపాలిటీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ, సాధికారిత కార్యాలయాల్లో సమర్పించాలని కలెక్టర్ శ్రీధర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా మూడవ శ్రావణమాసోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామం కమ్మపల్లికి సమీపంలో వెలసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రావణమాసం మూడవ శ్రావణ శనివారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర శ్రావణమాసం శ్రావణ శనివారం పురస్కరించుకొని ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం కమ్మపల్లె గ్రామస్తులు అందరూ కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల పిలుపుమేరకు బిసి సాధికారత రాష్ట్ర కన్వీనర్ గురిగింజ కుంట శివప్రసాద నాయుడు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు గుర్రం సుబ్బయ్య నాయుడు, గ్రామ నాయకులు శ్రీనివాసులు నాయుడు, ఆంజనేయులు నాయుడు, బాలకృష్ణ నాయుడు, నాగేందర్ నాయుడు, వేణుగోపాల్ నాయుడు, చిన్నపరెడ్డి, రెడ్డయ్య, రామచంద్ర, పైనేని రవిశంకర్, ఆదినారాయణ, జి.చంద్రశేఖర్, రవీందర్ నాయుడు, తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగంలో రాణించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువత వ్యా పార రంగంలో రాణిం చాలని తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు జునైద్ అక్బరీ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రామారావు కాలనీకి వెళ్లే దారిలో కొత్తమాచు లోకేష్, సలామత్, గోవర్ధన్ నూతనంగా నిర్మించిన మామ్స్ కిచెన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను జునైద్ అక్బరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో మామ్స్ కిచెన్ ఫ్యామిలీ భోజన ప్రియుల ఆదరాభిమానాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నాణ్యమైన వంటకాలతో, వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా అందిస్తూ కుటుంబంలో ప్రతి ఒక్కరిని ఆకట్టుకొనే విధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ మాంసాహార ప్రియులకు మా రెస్టారెంట్‌లో విభిన్న వంటకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులకు రుచి, శుచికరమైన వెరైటీలు అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ మధు బాబు, యర్రబల్లి వెంకటరమణ రెడ్డి, జోళపాలెం దేవేంద్ర, కమాలమర్రి కృష్ణ, జెసిబి మధుసూదన్‌రెడ్డి, ఒంటికొండ వెంకటేష్, కరీముల్లా, జంగాల వెంకటరమణ, కదిరి రాజ్ కుమార్, పెంచుపాడు స్వామి, పూల మురళి, గండికోట గణేష్ బాబు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న జునైద్ అక్బరీ

వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఎమ్మెల్యే షాజహాన్ బాషా పాలనా స్ఫూర్తితో పట్టణంలోని 14వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని టిడిపి నాయ కులు, వార్డు ఇన్‌ఛార్జి నాగూర్ వలి పేర్కొన్నారు. శనివారం వార్డు పరిధిలో మురుగునీటి కాలువలు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గం అభివృద్దే, ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ఎమ్మెల్యే పని చేస్తున్నారని తెలి పారు. ఆయన అడుగుజాడల్లో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసు కుంటున్నామన్నారు. నిరంతరం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే జహాకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఆయన నేతృత్వంలో మదనపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

'వేగవంతంగా రెవెన్యూ సేవలు'



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పౌరులకు వేగవంతంగా రెవెన్యూ సేవలను అందించేందుకు బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మండల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సర్వీసులలో భాగంగా ముటేషన్స్, నాలా కనెక్షన్స్, నీటి పన్ను, మీసేవ, ఎపి సేవ, కుల ధ్రువీకరణ పత్రాల సుమోటో రీ వెరిఫికేషన్ కేసుల ప్రగతి, ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్, భూ ఆక్రమణల తొలగింపు, అభివృద్ధి కార్యక్రమాలకు భూమి కేటాయింపులు తదితర అంశాలలో డివిజన్, మండల స్థాయి రెవిన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, డివిజన్ పరిధిలో చిత్తశుద్ధితో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. పౌరులకు అవసరమైన రెవెన్యూ సేవలను వేగవంతంగా అందజేసి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. నిర్దిష్ట కాల పరిమితిలోగా సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి అర్జీలు వెళ్లరాదని సూచించారు. జిల్లాలో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల రీ వెరిఫికేషన్, కుల ధృవీకరణ పత్రాల సుమోటో రీ వెరిఫికేషన్ కేసులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి పరిష్కరించాలని పేర్కొన్నారు. మ్యుటేషన్స్ అంగీకారం లేదా తిరస్కారాలను ప్రభుత్వం జారీ చేసిన నిబంధన ప్రకారం పక్కాగా చేయాలని తెలిపారు. మ్యుటేషన్స్ కొరకు అభ్యర్థన అందిన వెంటనే ఆన్‌లైన్‌లో ఫారం 8 జనరేట్ చేయాలిన్నారు. పిదప క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి రాజంపేట సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, నైదియా దేవి, ఆర్‌డిఒ రంగస్వామి, మండల తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాయచోటి

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్ప పుణ్య కార్యక్రమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని కొత్తపేట శివ రామాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్రమైన శ్రావణ మాసంలో దాతలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చాలా మంది ఆకలితో ఉన్నపుడు జీవితం చేజారి పోతున్నట్లుగా అనిపిస్తుందన్నారు. మనం అస్సలు ఏమి తినకుండా ఉంటే, మనం చనిపోతాం కాబట్టి అన్నదానం అనేది జీవాధారమని తెలిపారు. పండుగల సందర్భంగా దేవాలయాలకు వచ్చేవారిలో చాల మందికి అన్నాదానం చేస్తే ఎంతో మంచిదన్నారు. ఇలా ప్రతి ఒక్కరు భక్తి భావం అలవర్చుకొని సమజానికి ఉపయోగపడే మంచి పనులు చేయాలని ఆయన ఆకాంక్షించారు.

కవితా కుటీరంలో ఖాదర్‌వలి సంస్మరణ సభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువ కవి, రచయిత, ఆర్టీసీ ఉద్యోగి స్వర్గీయ పఠాన్ ఖాదర్‌వలి నాల్గవ వర్ధంతి సంస్మరణ సభ శనివారం స్థానిక ఎన్టీఆర్ లేఅవుట్‌లోని కవితా కుటీరంలో జరిగింది. ఈ సంస్మరణ సభలో ఖాదర్ వలి స్నేహితులు, సాహిత్య అభిమానులు, సాహితీ మిత్రులు ఆత్మీయంగా పాల్గొన్నారు. ప్రజాచైతన్య స్రవంతి అధ్యక్షులు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు పఠాన్ ఖాదర్‌వలి గురించి టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి రాసిన కవిగా ఖాదర్ వలీ జీవిత సాహితీ సాఫల్యం వ్యాసాన్ని సాహితీ మిత్రులకు చదివి వినిపిస్తూ ఖాదర్ వలీతో తమకున్న అనుబంధాన్ని మననం చేసుకోన్నారు. ప్రఖ్యాత కథా రచయిత వేంపల్లి సికిందర్ ఖాదర్‌వలీ నా కలం కన్నీరొలికింది గ్రంథంలోని కొన్ని కవితలను చదివి వినిపిస్తూ కవితలలో కనిపించిన కవి హృదయ ఆర్ద్రత, సామాజిక స్పృహ, నిబద్ధతలను విశ్లేషించారు. విశ్రాంత జైళ్ల శాఖ ఉద్యోగి, రచయిత కొడవటి ప్రభాకర్ ఖాదరవల్లితో తమకున్న సాహితీబంధాన్ని ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

'ఆదిత్య'లో విద్యార్థులకు నైపుణ్యంపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా ఐబిఎం స్కిల్స్ బిల్డ్ బూట్ క్యాంపు నైపుణ్య శిక్షణ తరగతులను ఇడునెట్ వారి ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించారని డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాన్ని బీటెక్ ఫైనల్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. విద్యార్థులు తగిన నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలని పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు విద్యార్థులను ఉద్దేశించి స్కిల్స్ పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ షఫీ, డాక్టర్ గంగాధర్‌రెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సి.మనోజ్ కుమార్, వివిధ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

అస్పష్టత!

ప్రజా 'దృష్టి'

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం సందేహాలకు తావిస్తోంది. జిల్లాలోని 50 మంది జడ్‌పిటిసి సభ్యుల్లో ఒకరు మినహా మిగిలిన సభ్యులు వైసిపి తరుపున గెలుపొందిన సంగతి తెలిసిందే. జడ్‌పి చైర్మన్ చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ బరిలో నిలిచి గెలవడంతో ఖాళీ ఏర్పడింది. చైర్మన్ ఎన్నిక అనివార్యంగా మారింది. ఇన్‌ఛార్జి చైర్మన్‌గా ప్రొద్దుటూరు జడ్‌పిటిసి జేష్టాది శారద వ్యవహరిస్తున్నారు. చైర్మన్ పదవికి రాజీనామా చేసిన ఆర్నెళ్లలోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కమలాపురం నియోజకవర్గానికి చెందిన ఓ టిడిపి సీనియర్ నాయకుడు చైర్మన్ పదవిపై కన్నేయడం ఆసక్తిని కలిగిస్తోంది. వైసిపి తరుపున చైర్మన్ రేసులో నిలిచిన చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి, బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డి టిడిపి వ్యూహాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. జగన్ జడ్‌పిటిసిలను తాడేపల్లికి పిలిపించుకుని సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జడ్‌పి చైర్మన్ పదవికి బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డిని ఎంపిక చేశారు. వైసిపి జడ్‌పిటిసిల్లో ఐదుగురు గైర్హాజరు కావడం సందేహాలకు తావిస్తోంది. టిడిపి తరుపున జడ్‌పి చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకత్వం వైసిపి జడ్‌పిటిసిలకు ఫోన్లు చేస్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో జడ్‌పి చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తోంది. వైసిపి, టిడిపి వ్యూహాత్మక రాజకీయం ఇలా ఉండగా జడ్‌పి చైర్మన్ పదవి ఎన్నిక నోటిఫికేషన్ వెలవడనుండడం సందేహాలకు తావిస్తోంది. చైర్మన్ పదవి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేస్తుందా, ఇన్‌ఛార్జి చైర్మన్‌తోనే జిల్లా పరిషత్ పాలక వర్గం నడిపించే అవకాశాలు ఉన్నాయా అనే సంగతి తేలాల్సి ఉంది. ప్రభుత్వం శుక్రవారం రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. మైసూరివారిపల్లి గ్రామసభనుద్దేశించి ప్రసంగించారు. గ్రామసభ ఆమోదించిన తీర్మానాలను మాత్రం ఏకరువు పెట్టారు. ఎటువంటి హామీగానీ, వరాలు గానీ ప్రకటించకపోవడం తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. పంచాయతీలను బలోపేతం చేస్తామని చెప్పడం మినహా ఫలానా సమస్యకు కేటాయింపులు చేస్తున్నామని ప్రకటించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హయాంలో రూ.41 కోట్ల ఉపాధిహామీ పథకానికి ఖర్చు చేశారని, ఇందులో రూ.21 వేల కోట్ల నిధులు ఏమయ్యాయో తెలియడం లేదని చెప్పడం మినహా ఎటువంటి ప్రయోజనమూ నెరవేరలేదు. తమ హయాంలో ఫలానా పనులకు ఫలానా మొత్తాన్ని ఖర్చు చేస్తామని ప్రకటించిన పాపాన పోలేదు. మొత్తం ఎపిసోడ్‌ను పరిశీలిస్తే ఒట్టి మాటలు కట్టిపెట్టడం మినహా గట్టి మేలు తలపెట్టిన దాఖలాల్లేవని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి : జడ్జి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మదనపల్లె ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి శిరీష, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎడిజె కోర్టు హాలులో శనివారం మదనపల్లె సబ్ డివిజన్‌లోని ఎస్ఐ, సిఐ, డిఎస్‌పిలతో పాటు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ సెప్టెంబర్ 14వ తేదీన అత్యున్నత న్యాయస్థానాల ఆదేశాలతో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. రాజీకాదగ్గ అన్ని రకాల కేసులను కక్ష దారుల అంగీకారం మేరకు అప్పటికప్పుడే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది మహిత, కృష్ణమూర్తి, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, సిఐలు, ఎస్ఐలు, డిఎస్‌పిలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తులు


దళితవాడలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కమ్మపల్లికి విద్యుత్ సౌకర్యం

-హర్షం వ్యక్తం చేసిన దళితవాడ ప్రజలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని చిన్నఒరంపాడు గ్రామపంచాయతీలోని కమ్మపల్లి దళితవాడలో సుమారు 50 కుటుంబాలు విద్యుత్ సౌకర్యం లేక చాలా ఏళ్లు నివసిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి గ్రామానికి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మొదటగా దళితవాడకు నూతన కరెంటు స్తంభాలు నాటి విద్యుత్‌ను అందిస్తామని హామీనిచ్చారని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ పోల్‌ను నాటించారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు కృషి చేసినందుకు వరలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ గడ్డి పెంచలయ్య, కోటేశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణుడి కల్యాణోత్సవం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సోమవారం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణుని కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కుర్ర మణియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉదయం 8 గంటలకు గోపూజ, 10 నుంచి 11.30 గంటల లోగా కల్యాణ మహోత్సవం, 12 గంటలకు జై గురుదేవ్, శ్రీ అయ్యప్ప భక్తాదులు, శ్రీకృష్ణ పాద సేవకుల సౌజన్యంతో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్య క్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకృష్ణ గీతా మందిరం నుంచి బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవం, ఊరేగింపునందు కోలాటం, రాత్రి 8 గంటలకు ఆలయం దగ్గర పెద్ద ఎత్తున బాణాసంచా కార్యక్రమం, అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


ఇఒకు విరాళాన్ని అందిస్తున్న దాతలు

ఆలయ పునర్నిర్మాణానికి రూ.25 వేల విరాళం

ప్రజాశక్తి-గుర్రంకొండ

మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డమ్మ దేవత దేవస్థాన ఆలయపునర్నిర్మాణానికి పుల్లంపేటకు చెందిన మైలపల్లి సుమతమ్మ, శివ నరసింహారెడ్డి దంపతులు రూ.25,116లు విరాళంగా అందించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం దాతలచే అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, ఆశీర్వాదం అంద జేశారు. ఈ మొత్తాన్ని ఇండియన్ బ్యాంకు వాయల్పాడులో ఆలయ ఖాతాకు దాతలు ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఆలయఇఒ మంజుల ధన్యవాదాలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రామపురం

మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అరణ్య ఈకో పార్క్‌లో శనివారం విద్యార్థులతో కలిసి అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటారు. తమ తల్లుల పేరుమీద సుమారు 30 మొక్కలు నాటించారు. పండ్లు, పూలు, నీడనిచ్చే వివిధ రకాల మొక్కలను నాటించారు. తమ తల్లుల పేరు పెట్టి నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని, నెలలలో ఒక పర్యాయం వాటిసంరక్షణ చూసుకోవాలని విద్యార్థులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో మద్దిమడుగు సెక్షన్ ఆఫీసర్ షకీలా అహ్మద్, తూర్పు బీట్ ఎఫ్ బిఒ ఎన్.బాషా, గువ్వలచెరువు వన సంరక్షణ సమితి మాజీ చైర్మన్ హరి ప్రసాద్‌లు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్ఐరామాంజనేయులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యవని ఎస్ఐ రామాంజనేయులు హెచ్చరించారు.మండల కేంద్రంలోని కలకడలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బహిరంగంగా మద్యం సేవించినచో వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా అపరాధ వేయడం జరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రక్కన, చెట్ల క్రింద ఎక్కడైనా మద్యం సేవిస్తూ కనిపిస్తే ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల అపరాధ రుసుం చెల్లించాల్సి వస్తోందన్నారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలను నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే పదివేలు ఫైన్‌తో పాటు కేసు నమోదు చేస్తామని తెలిపారు. మండలంలో మందుబాబులు ఈ విషయాలను గుర్తుంచుకొని జాగ్రత్తగా నడుచుకోవాలని ఎస్ఐ సూచించారు.

ప్రహరీకి నోచని గిరిజన పాఠశాల

- విషపురుగుల సంచారం
- భయాందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని గాండ్లపల్లె సమీపంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు.పాఠశాల కొత్తగా ప్రారంభించి రెండు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు ప్రహరీ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి సుమారు ఒక కిలోమీటరు దూరంలో గాండ్లపల్లె సమీపంలో వంక పక్కన పాఠశాల ఉందని అన్నారు. పాఠశాల ఆవరణంలో గుంతలు, ముళ్ల పొదలు ఉండటంతో విష పురుగులు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని అన్నారు. రాత్రి వేళల్లో బయటకు రావాలంటే భయంగా ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకుడు ఎరపరెడ్డి శరత్‌గిరిరెడ్డి సొంత ఖర్చుతో జెసిపితో పాఠశాలకు చుట్టూ ఉన్న ముళ్ల కంపలు, గుంతలను తీసి వేయించి శుభ్రం చేయించారని ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు చుట్టు ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ప్రహరీ లేకుండా ఉన్న గిరిజన పాఠశాల భవనం

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు


రాజంపేట: కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని శ్రీగౌరీశంకర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో కరస్పాం డెంట్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు కృష్ణాష్టమి వేడుకలలో భాగంగా గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థులు అలరిం చారని అన్నారు. విద్యార్థులు సంప్రదాయ పండుగలను జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రీజెన్సీ నలంద పాఠశాలలో సిఎఒ విజయ చందు ఆధ్వర్యంలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అహుతులను అలరించారు. ఈ సందర్భంగా విజయ చందు, ప్రిన్సిపల్ సుబ్బ రాయుడు మాట్లా డుతూ మాన వులు ఎలా జీవిం చాలో భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు బోధించి మాన వాళికి జగద్గురువయ్యాడని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధి లోని శ్రీ శాంతి పైనాక్కాల్‌లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యా యులు శ్రీని వాసులు ఆధ్వ ర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిం చడం జరిగింది. విద్యార్థులు శ్రీకృష్ణుని గోపికల వేషదారులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు ఉట్టి కొట్టి కేరింతలు కొట్టారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలోనీ నీరుగట్టువారిపల్లి నందుగల బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. కరస్పాండెంట్ మొరుంపల్లి సహదేవరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు మొరుంపల్లి రజినీల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యా ర్థులు శ్రీకృష్ణుడు, రుక్మిణి సత్యభామ, గోపికమ్మల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ భారతీయ సంస్కృతి, సంప్రదా యాలలో పర్వదినాలు ఒక భాగమన్నారు. తమ విద్యార్థులకు విద్యతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించడంలో భాగంగా పాఠశాలలో పర్వదినాలను నిర్వ హించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విద్యార్థులచే ప్రదర్శింపబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు వేషధారణలలో వచ్చి సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులను మొరుం పల్లి సహ దేవరెడ్డి, రజినీలు అభినందించారు. కార్య క్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ పాల్గొన్నారు.


పుల్లంపేట :కోలాటం ఆడుతున్న విద్యార్థులు


మదనపల్లి : ఉట్టి కొడుతున్న విద్యార్థులు


రైల్వేకోడూరు :గోపికల వేషధారణలో విద్యార్థులు

మండల సర్వసభ్య సమావేశం వాయిదా


సమావేశం వాయిదా పడటంతో తిరిగి వెళుతున్న ఎంపిపి

ప్రజాశక్తి-కలికిరి

మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు జరగాల్సిన సర్వసభ్య సమావేశం ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, వైసిపి ఎంపిటిసి సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వసభ్య సమావేశం దృష్ట్యా ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఏర్పాటు చేశారు. ఎంపిపి, వైసిపి ఎంపిటిసిలు సభకు రాకూడదని రోడ్డుపై పోలీసులు వారిని వారించి అక్కడ నుంచి పంపించేశారు. ఆలస్యంగా ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చి ఎంపిడిఒతో మాట్లాడి తిరిగి వెళ్ళిపోయారు. సమయానికి సభ్యులు ఎవరు రాకపోవడంతో అప్పటికే సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

మురుగు కాలువ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-సుండుపల్లి

సుండుపల్లి గ్రామపంచాయతీలోని రెడ్డన్నగారిపల్లెలో డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు లక్ష్మిరెడ్డి తెలిపారు. గ్రామంలో సిసి రోడ్లు ఏర్పాటు చేశారని డ్రెయినేజీ కాలవలు ఏర్పాటు చేయడం మరచి పోయారని అన్నారు.రోడ్డులోని పక్కన మురికి నీరు వచ్చి వ్యాధులకు గురవుతున్నామని, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ప్రయోజనం లేదని, గతంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి కూడా తీసుకెళ్లినా స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామంలో మురుగు రోడ్లపై ప్రవహించకుండా డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేస్తే విష జ్వరాల బారిన పడకుండా ఉంటామని తెలిపారు.


రోడ్డుపై పారుతున్న మురుగునీరు


ఆరు నెలలుగా వెలగని వీధి దీపాలు

వీధి దీపాలకు మోక్షమెప్పుడో?

- పట్టని పంచాయతీ అధికారులు


ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలోని రాయచోటి-సుండుపల్లె ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ కార్యాలయానికి వీధిలో వీధి దీపాలు లేక ఇబ్బందులకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఆరు నెలల నుంచి వీధి దీపాలు వెలగకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని అన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా కూడా ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. ప్రభుత్వాధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో విష పురుగులు తిరుగుతున్నాయని ఎప్పుడూ ఏం జరుగుతుందోనని ఆవేదన చెందుతున్నారు. వృద్ధులు, పిల్లలు తిరగాలంటేనే భయం ఆందోళనగా ఉందని అన్నారు. ఎందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలో ఎంత జనాభా ఉంటే అంత నిధులు తప్పకుండా మంజూరు అవుతాయని, ఆ నిధులు కనీసం వీధి దీపాలకైనా వినియోగించలేరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్తీ హోమ్‌ను సందర్శించిన కెనడా మహిళలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కెనడాకు చెందిన లిల్లీసింగ్ తన తల్లి మాల్విందర్‌కౌర్‌తో కలిసి ఈనెల 22,23 తేదీల్లో ఆర్తీహోమ్‌ను సందర్శించారు. వారి పని తీరును తెలుసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందిన లిల్లీసింగ్‌కు 15 మిలియన్లకు మించి ఫాలోయింగ్ ఉంది. లిల్లీసింగ్ అభినేత్రి, రచయిత్రి, దర్శకురాలు, నిర్మాత, సంఘసంస్కర్త, తన ద్వారా స్థాపించబడిన సంస్థ యూనికార్న్ ఐలాండ్, ఆర్తీహోంలాగానే సాంఘీక కార్యకలాపాలు, లింగ సమానత్వంపై పని చేయడం విశేషమన్నారు. వ్యవస్థాపకులు, అధ్యక్షులైన పి.వి.సంధ్య ఆర్తీ హోం కార్యకలాపాలు, సమాజంపై దాని ప్రభావం గురించి క్లుప్తంగా వివరించారు. ఆర్తీ స్కూల్‌కు అనంతరం లిల్లీసింగ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, డైరెక్టర్ భాగ్యమ్మ, హెడ్మాస్టర్ ఓబులేసుతో మాట్లాడారు. ప్రీస్కూలు పిల్లలతో కలిసి పద్యాలు చదవడం వారితో ఆట, పాటలతో గడిపారు. తన బృందంతో కలిసి పెద్ద పిల్లలతో మాట్లాడి వారి లక్ష్యాలను కను గొన్నారు. ఆర్తీహోమ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గాకుమారి, ఆర్తీహోం సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్తీ హోంలో చిన్నారులతో కలిసి ఆడుతున్న లిల్లీసింగ్


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నకమిషనర్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- కమిషనర్ పి.ఆర్.మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కమిషనర్ పి.ఆర్.పేర్కొన్నారు. పట్టణంలో కొన్ని వార్డులలో మురుగునీటి కాలువలు పెండింగులో ఉన్నాయని వీటి నిర్మాణానికి నిధులను మంజూరు చేయించి పూర్తి చేస్తామని చెప్పారు. దిగువ బస్టాండ్‌లో మురుగు నీటి కాలువ నిర్మాణాలను, పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో డ్రెయినేజీ కాలువలు స్తంభించి పోకుండా పూడికను తీసివేయిస్తామని అన్నారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. గృహాల్లోని చెత్తా చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త బుట్టలలో మాత్రమే వేసి పరిశుభ్రతను పాటించాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన రెడ్డిరాణి

ప్రజాశక్తి-సుండుపల్లె

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మండలంలోని సమస్యలను వివరించి నట్లు జనసేన పార్టీ మహిళా నాయకులు నంద్యాల రెడ్డి రాణి పేర్కొన్నారు. నియోజ కవర్గంలోని జనసేన పార్టీ కార్య కలాపాలను, అభివృద్ధి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నియోజకవర్గంలోనే అభివృద్ధి కార్యక్రమాలను తెలియ పరిచామని అన్నారు. డిప్యూటీ సిఎం ఒక పుస్తకం అందించి విజయవాడలోని జన సేన పార్టీ కార్యాలయంలో కలవమని చెప్పారని తెలిపారు.


పుస్తకాన్ని అందుకుంటున్న రెడ్డిరాణి

బీమా పరిహారం అందేనా...?

- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గత సంవత్సరంలో ప్రమాదాలు,అనారోగ్య సమస్యల వల్ల మృతి చెందిన వారికి ప్రభుత్వ బీమా పరిహారం అందలేదని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. నియోజవర్గంలో ప్రమాదాలు,ఆరోగ్య కారణాలతో కొందరు మృత్యువాతపడ్డారు. ఈ సందర్భంగా మృతులు, బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఏదైనా ప్రమాదంలో గాని, వ్యాధుల బారిన పడి మృతి చెందితే అధికారంలో ఉన్న ప్రభుత్వం రూ.5 లక్షలు ప్రమాద బీమా అందజేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో ప్రమాద బీమా డబ్బులు అందలేదని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ప్రమాద బీమా పరిహారం అందుతుందో లేదో అనే సందేహం మొదలైందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబాలకు ప్రమాద భీమా అందించి న్యాయం అందించాలని కోరుతున్నారు.


వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందిస్తున్న డాక్టర్ షఫీ నాయక్

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి హరితమ్మ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం పండ్లు , బ్రెడ్లు, తినుబండారాలను టిడిపి రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాయచోటి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చేసే సత్తా ఆయనకు ఉందని అన్నారు.చిన్న వయసులోని రాయచోటి కంచుకోట బద్దలు కొట్టిన రికార్డు సృష్టించి మంత్రి పదవి చేపట్టారని అన్నారు. రాబోయే పదేళ్లవరకు అధికారంలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కావలి ఆంజనేయులు, జడ్‌పి బాలికల పాఠశాల కమిటీ చైర్మన్ చైర్మన్ గంగాధర్, షేక్ మస్తాన్, చంద్ర, షేక్ ఇమ్రాన్, సాదిక్, రఫిక్ బాషా, ఈశ్వర్, మహేశ్వరి పాల్గొన్నారు.

బిపి, షుగర్, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించాలని కోణంపేట వైద్య అధికారి డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి గర్భిణులను గుర్తించి మొదటి మూడు నెలల్లోపు పేర్లు నమోదు చేయాలన్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి షుగర్, బిపి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, వందశాతం పూర్తి చేయాలని సూచించారు. బిపి, షుగర్ ఉన్నవారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించి క్రమం తప్పకుండా మందులను పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ రవీంద్ర, నీతి అయోగ్ అధికారి వెంకటరామిరెడ్డి, సూపర్‌వైజర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పిఒ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ సిద్దయ్య

క్రైం కార్నర్

10 లీటర్లు నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

నాటు సారా విక్రయస్థావరంపై శనివారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. శనివారం తవళం పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలోని చింత చెట్టు కింద వలిపి శాంతమ్మ నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడులు చేసి ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ మహిళ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.